GSTIN:36FDKPS1308P1ZX

టీ-మీడియా

సామాజికం ... ప్రజల పక్షం...

TMEDIA – మీ ఆదరణ... మా ప్రేరణ... మీ సమస్యం... మా బలం... – విజయం మా లక్ష్యం... ప్రజలే మా శక్తి... – 11వ వార్షికోత్సవం 2016 - 2026 – ధన్యవాదాలు!

ఈపేపర్, www.tmedia.net.in | యూట్యూబ్ | ఫేస్‌బుక్ | ఎక్స్ | ఇన్‌స్టాగ్రామ్

వార్తలు | వీడియోలు | ఫోటోలు | ఇంటర్వ్యూలు | ప్రజా సమస్యలు | ప్రత్యేక కథనాలు | విశ్లేషణలు

బుధవారం 14/10/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

మమతా బెనర్జీపై కత్తితో దాడికి మహిళ యత్నం



టీ మీడియా, అక్టోబర్ 13 , ఢిల్లీ బ్యూరో :

బంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నివాసం వెలుపల ఓ మహిళ హల్‌చల్ చేసినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపింది. కోల్‌కతాలోని కాళీఘాట్‌లో ఉన్న ఆమె నివాసం వద్ద మంగళవారం సాయంత్రం ఆ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ఆ మహిళ చేతిలో కత్తి పట్టుకుని మమతా బెనర్జీ దగ్గరకు వచ్చి దాడికి ప్రయత్నించిందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ దోలా సేన్ ఆరోపించారు. ఈ ఘటనపై ఆమె కాళీఘాట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.దోలా సేన్ ఫిర్యాదు ప్రకారం, మంగళవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో మమతా బెనర్జీ, తృణమూల్ నాయకుడు వైశ్వానర్ ఛటర్జీ, దోలా సేన్ కలిసి కాళీఘాట్‌లోని మిలన్ సంఘా దుర్గా పూజ వేడుకలకు వెళ్లేందుకు తమ నివాసం నుంచి బయలుదేరారు. ఆ సమయంలో ఓ మహిళ అక్కడికి వచ్చింది. మమతా బెనర్జీని పిన్ని అని పిలుస్తూ ఆమె దగ్గరకు వెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ మహిళ చేతిలో కత్తి ఉందని, మమతా బెనర్జీపైకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించిందని దోలా సేన్ ఆరోపించారు.

ఇండీ కూటమి పిటిషన్‌లో 14 లోపాలు

సవరిస్తే విచారిస్తామని చెప్పిన సుప్రీంకోర్టు

టీ మీడియా, అక్టోబర్ 13 , ఢిల్లీ బ్యూరో :

పెద్దఎత్తున ఓట్ల తొలగింపు సహా అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు 10 మంది ప్రతిపక్ష నేతలు దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం సుప్రీంకోర్టులో విచారణకు రాలేదు. ఈ పిటిషన్‌లో సుప్రీం కోర్టు రిజిస్ట్రీ గుర్తించిన లోపాలను పిటిషనర్లు ఇంకా సవరించకపోవడమే కారణంగా తేలింది. సుప్రీం కోర్టు వెబ్‌సైట్ సమాచారం ప్రకారం ఈ పిటిషన్‌లో రిజిస్ట్రీ మొత్తం 14 లోపాలను గుర్తించింది. కోర్టుకు చెల్లించాల్సిన రుసుములో 220 రూపాయలు తక్కువ పడటం కూడా వాటిలో ఒకటని తెలిపింది. మిగిలిన లోపాల్లో తొమ్మిది మంది పిటిషనర్ల అధికారిక అనుమతి పత్రాలు లేవని, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గుర్తింపు కార్డు నకలులో ఆయన ఫొటో ఐడి స్పష్టంగా లేదని వివరించింది. పిటిషన్‌లో పొందుపరిచిన కొన్ని పత్రాలు చదవడానికి వీలులేకుండా ఉన్నాయని వివరించింది. పేజీల నంబరింగ్ క్రమంలో వ్యత్యాసాలు వంటి లోపాలున్నాయని, వాటిని సవరించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదిని సుప్రీంకోర్టురిజిస్ట్రీఆదేశించింది.మంగళవారం ఈ వ్యవహారాన్ని ఒక జర్నలిస్ట్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ ప్రస్తావించగా, సి జె ఐ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషనర్లకు భరోసా ఇచ్చింది. లోపాలను సరిదిద్దినట్లయితే వారి అంశాలను విచారణ కోసం జాబితా చేస్తామని తెలిపింది. "మేము ఈ పిటిషన్లన్నింటినీ విచారణకు జాబితా చేస్తాము. అయితే ముందుగా అందులోని లోపాలన్నీ సవరించేలా చూసుకోండి." అని స్పష్టం చేసింది.కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో ఖర్గేతో పాటు ఎంపీ సౌగతా రాయ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, రాష్ట్రీయ జనతా దళ్ నేత తేజస్వీ యాదవ్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్ వర్గం) నేత సుప్రియా సూలే, శివసేననేత సంజయ్ రౌత్,
సిపిఐ కు చెందిన డి. రాజా, ఝార్ఖండ్ ముక్తి మోర్చా ఎంపీ మహువా మాఝీ, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, ముస్లిం లీగ్ నేత ఇ.టి. మహమ్మద్ బషీర్ తదితరులు సహ పిటిషనర్లుగా ఉన్నారు. ఈ కేసులో భారత ఎన్నికల సంఘంప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్? కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలను ప్రతివాదులుగా చేర్చారు.ఓటర్ల జాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ') ప్రక్రియలో పెద్ద ఎత్తున ఓటర్ల పేర్ల తొలగింపులు, అక్రమాలు జరిగాయని ఈ పిటిషన్లో ఆరోపించారు.సమయంలో జరిగిన తొలగింపులు, మార్పులపై నిర్ణీత కాలపరిమితిలో స్వతంత్ర ఆడిట్ నిర్వహించేందుకు, సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో సాంకేతిక నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కోరింది. చట్టప్రకారం తగిన నోటీసు, విచారణకు సహేతుకమైన అవకాశం లేకుండా ఏ ఓటరు పేరునూ జాబితా నుంచి తొలగించకుండా చూడాలని, అలాగే ఎన్నికలు జరగనున్న పంజాబ్, ఇతర రాష్ట్రాల్లో అర్హులైన వ్యక్తులు చట్టం అనుమతించిన చివరి తేదీ వరకు తమ పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చుకునేందుకు అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలని కూడా ఇది కోరింది.ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల సంఘం వ్యవహారాలు, పలువురు విద్యార్థుల



ఏకపక్ష అరెస్టులు, మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు వంటి (మిగతా 2లో)

సీట్ల సర్దుబాటుపై కసరత్తు



వరుసగా కూటమి నేతల భేటీ

టీ మీడియా, అక్టోబర్ 13 , అమరావతి బ్యూరో :

కూటమిలో సీట్ల సర్దుబాటు పంచాయితీని కొలిక్కి తేవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. జనసేన సీట్ల లెక్కలు తేల్చాక బీజేపీతో చర్చలకు వెళ్లాలని నిర్ణయించారు. కార్పొరేషన్లు, మునిసిపాలిటీల వారీగా సీట్ల పంపకాలపై కసరత్తు కీలక దశకు చేరింది. సీఎంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు సమావేశమై సీట్ల సర్దుబాటు అంశంపై చర్చించారు.అనంతరం జనసేన నేతలతో చర్చించేందుకు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల ఆ పార్టీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ జనసేన అధినేత (మిగతా 2లో)

ఒక్కో ఉద్యోగికి రూ.1,53,912 బోనస్

ఒప్పంద కార్మికులకు రూ.5,500

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

టీ మీడియా, అక్టోబర్ 13 ,హైదరాబాద్ బ్యూరో :

సింగరేణి సంస్థలో 34 శాతం లాభాలను బోనస్? కింద ఉద్యోగులకు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. దీని ప్రకారం ఒక్కో సింగరేణి ఉద్యోగికి రూ.1,53,912 బోనస్? వస్తుందని చెప్పారు. ఒప్పంద కార్మికులకు మాత్రం రూ.5,500 ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈసారి సంస్థకు రూ.1,754 కోట్ల మేర లాభాలు వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు.

శాశ్వత కార్మికులుగా 38 వేల మంది

సింగరేణి సంస్థలో శాశ్వత కార్మికులుగా 38 వేల మంది ఉన్నారని భట్టి విక్రమార్క తెలిపారు. అదనంగా మరో 30 వేల మంది కాంట్రాక్టు వర్కర్లు ఉన్నారని తెలిపారు. సింగరేణిలో పెండింగ్ అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నామన్న ఆయన పెండింగ్‌లో ఉన్న 300 మంది డిపెండెంట్ కార్మికుల ఆర్డర్లను 15



రోజుల్లో ఇస్తామన్నారు. మారుపేర్లకు సంబంధించిన సమస్యను 15 రోజుల్లో పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. విధులకు హాజరుకాని ఉద్యోగులను డిస్మిస్ చేశామన్న ఆయన కరోనా వేళ విధులకు హాజరుకాని వారికి మాత్రం వన్‌టైమ్ ఆప్షన్ ఇచ్చినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ భారీ నష్టం చేసింది

సింగరేణి ఉద్యోగులకు సొంత ఇంటి కల నెరవేర్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు భట్టి పేర్కొన్నారు. అర్హులైన వారికి సింగరేణి ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రకటించారు. మైనింగ్ లేనిచోట లేఅవుట్ చేసి నెహ్రూ హౌసింగ్ కాలనీ పేరుతో ఇళ్లు నిర్మించి అందించనున్నట్లు తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో సింగరేణి ఆస్పత్రులు ఉంటాయన్నారు. బీఆర్ఎస్ అనాలోచిత నిర్ణయాల వల్లే ?సింగరేణి లాభాలు తగ్గాయన్న భట్టి చరిత్రలో వారు చేసినంత నష్టం ఎవరూ చేయలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో కేంద్ర (మిగతా 2లో)

శబరిమలలో ఫొటోగ్రఫీ, డ్రోన్లపై బ్యాన్



రోడ్ల పక్కన వంటపైనా నిషేధం

టీ మీడియా, అక్టోబర్ 13 ,శబరిమల :

మండల–మకరవిళక్కు సీజన్ నేపథ్యంలో కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శబరిమల, పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయడంలో భాగంగా పలు కఠినమైన ఆంక్షలు విధిస్తూ పథనంతిట్ట జిల్లా కలెక్టర్ ఎ. నిజాముద్దీన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, డ్రోన్లపై నిషేధంతో పాటు మాంసాహారం, హోటళ్లపైనా ఆంక్షలు విధించారు.

ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీపై పూర్తి నిషేధం

శబరిమల సన్నిధానం, పంబ, నిలక్కల్ ప్రాంతాల్లో ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీపై జిల్లా కలెక్టర్ పూర్తి నిషేధం విధించారు. సన్నిధానంలోని నలంబలం లోపల భక్తులు విచ్చలవిడిగా కెమెరాలు, మొబైల్ ఫోన్లు ఉపయోగించడం వల్ల దర్శనానికి తీవ్ర ఆటంకం కలుగుతోందని, దీనివల్ల తోపులాటలు జరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు. సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొంది, భద్రతా అధికారిక అవసరాల కోసం చేపట్టే ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీకి ఈ ఆంక్షల నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపింది.

డ్రోన్‌ల వినియోగంపై పూర్తి నిషేధం

దీంతో పాటు యాత్రా సీజన్‌లో సన్నిధానం, పంబ, నీలక్కల్ సహా అటవీ ప్రాంతాల్లో అనధికారిక అవసరాల కోసం డ్రోన్‌ల వినియోగంపై పూర్తి నిషేధం విధించింది. జిల్లా పోలీస్ చీఫ్ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే అధికారిక అవసరాల కోసం డ్రోన్‌లను ఉపయోగించడానికి భద్రతా సంస్థలకు అనుమతి ఉంటుందని స్పష్టం చేసింది. సన్నిధానం, పంబ, నీలక్కల్ సహా చుట్టుపక్కల అటవీ ప్రాంతాలు అత్యంత సున్నితమైనవి. ఉత్సవ సమయంలో ఈ ప్రాంతాలకు భారీగా భక్తులు తరలివస్తుంటారు. ఇలాంటి ప్రాంతాల్లో అనుమతి లేకుండా డ్రోన్‌లను నడపడం భక్తుల భద్రతకు, గోప్యతకు తీవ్ర ముప్పు కలిగిస్తుంది. అంతేకాకుండా డ్రోన్‌లు భద్రతా వ్యవస్థకు తీవ్ర సవాలుగా మారడంతో పాటు అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయని అధికారులు తెలిపారు.

యాత్రా మార్గంలో అనధికారికంగా రోడ్డు పక్కన వ్యాపారం చేయకూడదు

ఇంకా నవంబర్ 11 నుంచి 2027 జనవరి 25 వరకు పంబ నుంచి (మిగతా 2లో)

జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తత



సిజెపి నేతలపై ఎఫ్ఐఆర్ నమోదు

టీ మీడియా, అక్టోబర్ 13 , ఢిల్లీ బ్యూరో :

దేశ రాజధాని దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు ప్రయత్నించిన కాక్రోజ్ జనతా పార్టీ నేతలపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనుమతి లేకుండా నిరసన ప్రదేశంలోకి ప్రవేశించడంతో పాటు గతంలో ఇచ్చిన హామీలను ఉల్లంఘించారనే ఆరోపణలతో ఆ చర్య తీసుకున్నారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జఫ్రో నేతలు మంగళవారం జంతర్ మంతర్ వద్ద నిరసనకు ప్రయత్నించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ వారు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ (మిగతా 2లో)

ఇండీ కూటమి పిటిషన్‌లో 14 లోపాలు

(మొదటి పేజీ తరువాయి)

అంశాలపై వినతిపత్రం సమర్పించేందుకు అవకాశం ఇవ్వాలని రాహుల్ గాంధీ, ఖర్గే కోరగా భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నిరాకరించారు. అయితే, దీనిపై న్యాయపరంగా పిటిషన్ దాఖలు చేస్తే త్వరితగతిన విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు. దీంతో ఇండీ కూటమి సుప్రీం కోర్టుకు భారీ ర్యాలీ చేపట్టి పిటిషన్ దాఖలు చేసింది.

సీట్ల సర్దుబాటుపై కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

పవన్ కల్యాణ్?తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జనసేన తరపున సమావేశంలో నాదెండ్ల మనోహర్, వంశీకృష్ణ యాదవ్, చిల్లపల్లి శ్రీనివాస్ చర్చల్లో పాల్గొన్నారు. మరోవైపు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ చంద్రబాబుతో భేటీ అయి తమ పార్టీకి కేటాయించాల్సిన సీట్లపై చర్చించారు. రాత్రి మరోసారి బీజేపీ నేతలతో సమావేశం కావాలని నిర్ణయించారు.తొలుత జనసేనతో సీట్ల సర్దుబాటును కొలిక్కి తెచ్చి, ఆ తర్వాత బీజేపీతో చర్చలు జరపాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. రాత్రి 8 గంటలకు సీఎం నివాసంలో కూటమి నేతలు మరోసారి భేటీ కానున్నారు. ఈ చర్చల్లో ఏయే పార్టీకి ఎన్ని సీట్లు దక్కుతాయన్న దానితో పాటు, కీలక నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై ఈ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశముంది. కూటమి ఐక్యతను కాపాడుకుంటూ, గెలుపు అవకాశాలకు ప్రాధాన్యమిస్తూ సీట్ల పంపకాన్ని పూర్తి చేయడం ఇప్పుడు మూడు పార్టీల ముందు కీలక అంశంగా మారింది.

శబరిమలలో ఫొటోగ్రఫీ, డ్రోన్లపై బ్యాన్

(మొదటి పేజీ తరువాయి)

సన్నిధానం వరకు ఉన్న యాత్రా మార్గంలో అనధికారికంగా రోడ్డు పక్కన వ్యాపారం చేయడాన్ని నిషేధించింది. వడసేరికర నుంచి అత్తతోడు వరకు ఉన్న మార్గాల పక్కన పశువులను కట్టేయడం, మేపడాన్ని కూడా కలెక్టర్ నిషేధించారు. అదనంగా యాత్రా సమయంలో లాహ– సన్నిధానం మధ్య నడిచే హోటళ్లలో ఒకేసారి నిల్వ చేయగల గ్యాస్ సిలిండర్ల గరిష్ట సంఖ్యను ఐదుకు పరిమితం చేశారు. ప్రజలు సంచరించే ప్రదేశాల్లో ప్రమాదకరమైన రీతిలో గ్యాస్ సిలిండర్లను నిల్వ చేయడాన్ని నిషేధించింది.

మాంసాహారాన్ని నిల్వ చేయడం, వండటం, అమ్మడంపైనా ఆంక్షలు

ముఖ్యంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి శబరిమలకు వెళ్లే రహదారుల పక్కన, నీలక్కల్ వద్ద, ఇతర పార్కింగ్ స్థలాల్లో నిలిపి ఉంచిన వాహనాల దగ్గర వంట చేయడాన్ని పూర్తిగా నిషేధించింది. ఈ సమయంలో లాహ్ నుంచి సన్నిధానం వరకు ఉన్న యాత్రా మార్గాల్లో ఉన్న హోటళ్లు మాంసాహారాన్ని నిల్వ చేయడం, వండటం, అమ్మడంపైనా ఆంక్షలు విధించారు.

మండల యాత్రకు విస్తృత ఏర్పాట్లు

మండల యాత్ర ప్రారంభానికి కేవలం కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో జిల్లా యంత్రాంగం ఈ నిబంధనలను కఠినతరం చేసింది. భక్తులకు ప్రాథమిక సౌకర్యాలు కల్పిస్తూనే, భద్రతా విషయాల్లో ఎటువంటి రాజీ ఉండదని అధికారులు స్పష్టం చేశారు. శబరిమల, దాని పరిసర ప్రాంతాల్లో వివిధ శాఖల సమన్వయంతో విస్తృతమైన ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పర్యావరణ అనుకూల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, సురక్షితమైన యాత్రను సులభతరం చేయడమే జిల్లా యంత్రాంగం యొక్క అంతిమ లక్ష్యమని అధికారులు చెప్పారు.

ఒక్కో ఉద్యోగికి రూ.1,53,912 బోనస్

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ఆధ్వర్యంలోని 141 కోల్ బ్లాక్స్?కు వేలం జరిగితే ఒక్క వేలంలో కూడా సింగరేణిని పాల్గొనకుండా చేశారని దుయ్యబట్టారు.

తమ హయాంలోనే రూ.1.2 కోట్ల ప్రమాద బీమా

సింగరేణి సంస్థలో 3,189 పోస్టులు భర్తీ చేశామని ఐటీ మంత్రి శ్రీధర్?బాబు అన్నారు. కారుణ్య నియామకాలకు సంబంధించిన అంశంలో రాజకీయం చేస్తున్నారని, ఈ అంశంలో కూడా 2,437 కారుణ్య నియామకాలు చేసినట్లు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్ట కార్మికులను గుర్తించలేదని అన్నారు. ??సింగరేణి కార్మికులకు తమ హయాంలో రూ.1.2 కోట్లు, కాంట్రాక్ట కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమా అమలు చేస్తున్నట్లు చెప్పారు. తాము సింగరేణికి కొత్త కోల్ బ్లాక్‌లను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు.

కార్మికుల ఆందోళన

అంతకు ముందు సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళనకు దిగారు. ఖైరతాబాద్‌లోని విద్యుత్ సౌధ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సింగరేణి బకాయిలతో పాటు కార్మికులకు రావాల్సిన లాభాల వాటా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా దిగిపోయే సమయానికి సింగరేణికి రూ.26 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే బకాయిలు చెల్లిస్తామని చెప్పి మాట తప్పారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బకాయిలు రూ.59 వేల కోట్లకు పెరిగాయని ఆరోపించారు. సింగరేణి సంస్థ మనుగడ కొనసాగలంటే ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారు. జంతర్ మంతర్‌ను ఇటీవల అధికారిక నిరసన ప్రదేశాల జాబితా నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో అక్కడ భారీగా బారికేడ్లు ఏర్పాటు చేశారు.అయినప్పటికీ, పార్టీ నేతలు వాటిని దాటి నిరసన స్థలంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారని పోలీసులు తెలిపారు. దీంతో సిజెపి నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా, అజింక్య షిండేతో పాటు ఇతర కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. పార్టీకి చెందిన సుమారు 11 మంది కార్యకర్తలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని జఫ్రీ తెలిపింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. గతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించబోమని ఇచ్చిన హామీని ఉల్లంఘించారనే అంశాన్ని కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

కుక్కల దాడి లో గాయపడ్డ చిన్నారులు


టీ మీడియా,అక్టోబర్ 13 ,పెబ్బేరు:

వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని 8 9 వ వార్డుల్లోని సినిమా థియేటర్ రోడ్డులో రెండు రోజుల నుండి 10 మందికీ పైగా చిన్నారులు పెద్దలు వీధి కుక్కల బారిన పడి గాయ పడటం జరిగిందని వార్డుల్లో ప్రజలు కలవరపడుతున్నారు పట్టణంలో మరెన్నో చోట్ల ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించాలని ప్రజా ఆరోగ్య రక్షణ దృష్టిలో ఉంచుకొని కుక్కలను తక్షణం పట్టణం నుండి తరలించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



నివాస భవనంలోనే ఖమ్మం “కిడ్స్‌మార్ట్”







- పైన ఫంక్షన్ హాల్
- ఒక ఆస్తికి రెసిడెన్షియల్..
- మరో దానికి మిక్స్‌డ్ యూజ్

టీ మీడియా, అక్టోబర్ 13,ఖమ్మం:

ఖమ్మం నగరంలోని కమాన్‌బజార్, బెస్తా కాలనీ ప్రాంతంలో ఉన్న కిడ్స్‌మార్ట్ భవనం వినియోగం, ఆస్తిపన్ను వివరాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భవనంలో కింద కిడ్స్‌మార్ట్ దుకాణం నిర్వహిస్తుండగా, పై అంతస్తులో ఫంక్షన్ హాల్ ఉన్నట్లు క్షేత్రస్థాయి పరిశీలన సూచిస్తున్నాయి. అయితే భవనానికి సంబంధించిన అనుమతులు, వినియోగ వర్గీకరణ, పన్నుల చెల్లింపులపై ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

రెసిడెన్షియల్ వర్గీకరణలో ఆస్తి!

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఆన్‌లైన్ ఆస్తిపన్ను వివరాల ప్రకారం, సదరు యజమాని పేరుతో ఉన్న ఒక ఆస్తికి పి టి ఐ యన్ నంబర్ 1106003874గా నమోదై ఉంది. డోర్ నంబర్ 9–9–27గా, వినియోగ రకం ‘నివాసం గా చూపిస్తోంది. 13 అక్టోబర్ 2026 నాటికి చూపిన వివరాల్లో మొత్తం బకాయి రూ.3,596గా ఉంది.

మరో ఆస్తికి పి టి ఐ యన్ నంబర్ 1106003879గా, డోర్ నంబర్ 9–9–27/1గా నమోదై ఉంది. దీనిని. మిక్స్‌డ్‌గా పేర్కొంటూ రూ.3,044 బకాయిని ఆన్‌లైన్ వివరాలు చూపిస్తున్నాయి.

ఈ రెండు రికార్డులు ఒకే భవనంలోని వేర్వేరు భాగాలకు సంబంధించినవా? ఆస్తుల వినియోగానికి అనుగుణంగా పన్ను వర్గీకరణ జరిగిందా? అనే అంశాలను అధికారిక రికార్డులతో నిర్ధారించాల్సి ఉంది.

అనుమతులు ఉన్నాయా?

భవనంలో వాణిజ్య దుకాణంతో పాటు ఫంక్షన్ హాల్ కార్యకలాపాలు జరుగుతున్నట్లయితే, వాటికి సంబంధించిన భవన నిర్మాణ అనుమతులు, వినియోగ అనుమతులు, అగ్నిమాపక భద్రతా నిబంధనలు వర్తించే మేరకు పాటిస్తున్నారా అనే అంశాలపై సంబంధిత అధికారులు పరిశీలన జరపాలి.అలాగే ఆస్తిపన్ను బకాయిలు ఎందుకు చెల్లించలేదు? నివాస వినియోగంగా నమోదైన ఆస్తిలో వాణిజ్య కార్యకలాపాలుజరుగుతున్నాయా? పన్ను వర్గీకరణలో మార్పులు అవసరమా? అన్న ప్రశ్నలకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సమాధానం ఇవ్వాలి.

వ్యాపార సంస్థలకు మినహాయింపులా?

సాధారణ ప్రజలు ఆస్తిపన్ను, భవన అనుమతులు, ఇతర నిబంధనల విషయంలో అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తున్న తరుణంలో, వాణిజ్య భవనాల విషయంలోనూ అదే స్థాయిలో తనిఖీలు జరుగుతున్నాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

టీ మీడియా డిమాండ్: కిడ్స్‌మార్ట్ భవనానికి సంబంధించిన ఆస్తిపన్ను రికార్డులు, భవన వినియోగ అనుమతులు, ఫంక్షన్ హాల్ నిర్వహణకు సంబంధించిన అనుమతులను అధికారులు పరిశీలించి, నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు నిజమో కాదో అధికారిక విచారణ ద్వారా తేల్చాలి.

గమనిక: ఆన్‌లైన్ పన్ను వివరాల్లో బకాయిలు కనిపించడం మాత్రమే అక్రమ నిర్మాణం లేదా అనుమతుల ఉల్లంఘనకు రుజువు కాదు. సంబంధిత అధికారుల వివరణ, ధ్రువీకరించిన రికార్డుల ఆధారంగా పూర్తి వాస్తవాలు వెలుగులోకి రావాలి.

యస్.బి.ఐ.టి. కళాశాలలో బతుకమ్మ సంబరాలు





టీ మీడియా, అక్టోబర్ 13 , ఖమ్మం:

తెలంగాణా సాంప్రదాయానికి చిహ్నం బతుకమ్మ పండుగ అని యస్.బి.ఐ.టి. కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం కళాశాల ఆవరణలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులను, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ తెలంగాణా ఆత్మ గౌరవాన్ని నిలబెట్టేలా ఊరు వాడలలో బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తామని, చిన్న పెద్ద తేడా లేకుండా రాష్ట్ర పండుగలా జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని వివిధ విభాగాల వారిగా సాంప్రదాయ వస్త్రాదారణ పోటీలు, బతుకమ్మలను పేర్చే పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తెలంగాణా పూల పండుగగా పిలుచుకొనే బతుకమ్మ పండుగను విద్యార్థుల సమక్షంలో జరుపుకోవడం ఆనందదాయకంగా ఉందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. తొమ్మిది రోజులపాటు వివిధ పేర్లతో నిర్వహించే ఈ వేడుకలకు వివిధ ప్రాంతాలలో వివిధ కథలతో ముడిపడి ఉందని, చరిత్ర ఏదైనా వేడుకలను నిర్వహించడంలో శాస్త్రీయ కోణం కూడా లేకపోలేదని కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. భావితరాలు తమ తెలంగాణా సాంప్రదాయ మూలాలు మరిచిపోకుండా ఇటువంటి వేడుకలు దోహదపడతాయని కళాశాల ప్రిన్సిపల్ డా॥ జి. రాజ్‌కుమార్ తెలిపారు. టెక్నాలజీల వెంట పరిగెత్తె ఈ రోజులలో ఇటువంటి పండుగలు సాంప్రదాయాన్ని, విలువలను గుర్తు చేస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకలలో విద్యార్థులు సాంప్రదాయ నృత్యాలతో హో రెత్తించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో గ్రామాభివృద్ధి సాధిద్దాం

టీ మీడియా ,అక్టోబర్ 13, కూసుమంచి:

ప్రజల సహకారముతో అన్ని రంగాలలో గ్రామాభివృద్ధి సాధిద్దామని పాలేరు గ్రామపంచాయతీ సర్పంచ్ బానోతు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కూసుమంచి మండలం పాలేరు గ్రామ పంచాయతీ సాధారణ సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో త్రాగునీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగుతుందని, మరమ్మత్తులు ఏర్పడ్డ సమయంలో వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో వీధిలైట్లతో వెలుగులు విరజిముతున్నట్లు, 60 లక్షల రూపాయల వ్యయంతో గ్రామంలో అవసరమైన చోట సైడ్ డ్రైన్స్, సిసి రోడ్ల నిర్మాణ పనులు జరిగాయి అన్నారు. ప్రస్తుతం పాలేరు గ్రామపంచాయతీ లో 1 కోటి 25 లక్షల రూపాయల సాధారణ నిధులు నిల్వమున్నట్లు సర్పంచి బానోతు నాగేశ్వరరావు వెల్లడించారు.



ఈ సభలో పాలేరు గ్రామపంచాయతీ అధికారి రమాదేవి, విద్యుత్తు లైన్మెన్ రమేష్, గ్రామ ఇంచార్జి సెక్రెటరీ రాజేష్, వ్యవసాయ విస్తరణ అధికారి మన ఊరు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలక మండలి సభ్యులు గోపె రాము, ఎస్.కె రంజాన్, బత్తుల నరసయ్య, కందుల విజయ బాబు, శీలం కల్పన రామకృష్ణ, పాలేరు గ్రామస్తులు ఎడవెల్లి ఉపేందర్ రెడ్డి, పందిరి వీరారెడ్డి, చాపల నరేష్, కొత్త పుల్లారెడ్డి, దాసరి వెంకన్న, అద్దంకి కోటాచారి, కందుల బాబు, శీలం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అతి పెద్ద లౌకిక వాది బ్రాహ్మణ వృత్తి (దారులు)

భారత దేశం లో అతి పెద్ద లౌకిక వాది బ్రాహ్మణ వృత్తి (దారులు) .కులం ,మతంప్రాంతం,రాజకీయాల కుఅతీతంగా కోరిన వారికి అందరికీసేవలుఅందించే వారిలోబ్రాహ్మణ వృత్తి దారులు ఉన్నారు. ఈ వృత్తి దారులు పైన కార్పొరేట్ప్రభావం ఉన్నది. బ్రాహ్మణ వృత్తి దారులు అందరూ మతోన్మాది/కుల వాదులు కారు.ఉన్న వృత్తి లో అది ఉండదు. వాస్తవాలు వక్రీకరణ చేసి,కుల,మత త త్వ విదానం తో తమకు తాము గొప్ప అనిపించు కొనే ప్రయత్నం లో బ్రాహ్మణ వృతి దారులు అందరు ని చెడ్డ వారీగా చిత్రీకరణ జరుగుతోంది.

బ్రాహ్మణ ఇజం పరిశీలన

“బ్రాహ్మణ ఇజం” అంటే సాధారణంగా బ్రాహ్మణ సంప్రదాయాలు, ఆచారాలు, మతపరమైన భావజాలానికి సంబంధించిన పదం. అయితే రాజకీయ, సామాజిక చర్చల్లో ఈ పదాన్ని వేరే అర్థంలో కూడా ఉపయోగిస్తారు. సులభంగా చెప్పాలంటే:

మతపరమైన అర్థం: వేదాలు, యజ్ఞాలు, ఆచారాలు, సంప్రదాయాలకు సంబంధించిన భావజాలం.

సామాజిక అర్థం: కుల వ్యవస్థలో బ్రాహ్మణులకు ప్రత్యేక ఆధిపత్యం లేదా ఉన్నత స్థానం ఉండాలని భావించే వ్యవస్థను విమర్శించడానికి ఈ పదాన్ని ఉపయోగిస్తారు.

రాజకీయ అర్థం: కుల ఆధిపత్యం, కుల వివక్షను విమర్శించే సందర్భాల్లో ఈ పదం వినిపిస్తుంది.

ముఖ్యమైన విషయం: బ్రాహ్మణులు అనే కులానికి చెందిన వ్యక్తులందరినీ “బ్రాహ్మణ ఇజం”తో సమానంగా చూడకూడదు. బ్రాహ్మణులందరూ కుల ఆధిపత్యాన్ని సమర్థిస్తారని చెప్పడం సరికాదు.

ఒక ఉదాహరణ: “బ్రాహ్మణ ఇజానికి వ్యతిరేకంగా పోరాడాలి” అని ఎవరైనా అంటే, సాధారణంగా వారు బ్రాహ్మణ వ్యక్తులందరినీ కాకుండా, కుల ఆధిపత్యం లేదా కుల వివక్షను సమర్థించే భావజాలాన్ని వ్యతిరేకిస్తున్నామని ఉద్దేశించి ఉండవచ్చు.

1)మనుస్మృతి గ్రంథంలోని సామాజిక నియమాలు, కుల ఆధారిత విధులు, హక్కుల గురించి ఉన్న భావనలతో ఈ పదానికి సంబంధం ఉంది. ఆధునిక రాజకీయాల్లో కుల అసమానతలు, వివక్షను సమర్థించే భావజాలాన్ని విమర్శించడానికి ఈ పదాన్ని ఉపయోగిస్తారు.

ఉదాహరణ: “మనువాదానికి వ్యతిరేకంగా పోరాడాలి” అంటే సాధారణంగా కుల ఆధారిత అసమానతలను వ్యతిరేకించాలని ఉద్దేశిస్తారు.

3. హిందుత్వం

ఇది హిందూ గుర్తింపు, భారతీయ సంస్కృతి, జాతీయతను రాజకీయ దృక్పథంలో నిర్వచించే సిద్ధాంతం. ఆధునిక రాజకీయ చర్చల్లో హిందూ జాతీయవాదంతో అనుసంధానమై ఉంటుంది.

ఉదాహరణ: భారతదేశ రాజకీయాలు, జాతీయ గుర్తింపులో హిందూ సంస్కృతికి ఎలాంటి స్థానం ఉండాలనే చర్చల్లో ఈ పదం వినిపిస్తుంది.

ఒక పట్టికలో సులభంగా గుర్తుంచుకోండి

పదం రాజకీయ చర్చల్లో ప్రధాన భావం

బ్రాహ్మణిజం బ్రాహ్మణ సంప్రదాయాలు; కొన్ని సందర్భాల్లో కుల ఆధిపత్య భావజాలం

మనువాదం మనుస్మృతి ఆధారిత సామాజిక నియమాలు; కుల అసమానతలపై విమర్శ

హిందుత్వం హిందూ గుర్తింపు, సంస్కృతి, జాతీయతకు సంబంధించిన రాజకీయ సిద్ధాంతం

ముఖ్యమైన విషయం

ఈ మూడు పదాలు ఒకదానికొకటి పూర్తిగా సమానం కావు. హిందుత్వాన్ని సమర్థించే ప్రతి వ్యక్తి కుల వివక్షను సమర్థిస్తారని చెప్పలేం. అలాగే ప్రతి బ్రాహ్మణుడు బ్రాహ్మణిజం లేదా మనువాదాన్ని సమర్థిస్తారని కూడా చెప్పలేం. ఆయా వ్యక్తుల అభిప్రాయాలు, ఆచరణలు, రాజకీయ ప్రకటనలను విడిగా పరిశీలించాలి.రాజకీయాల్లో ఈ చర్చ ఎందుకు వస్తుంది? కుల సమానత్వం, రిజర్వేషన్లు, రాజ్యాంగ హక్కులు, మతం--రాజకీయాల సంబంధం వంటి అంశాలపై భిన్న అభిప్రాయాలు ఉండటం వల్ల ఈ పదాలు చర్చలోకి వస్తాయి.



శనగపాటి మురళి కృష్ణ
ఇండిపెండెంట్ జర్నలిస్ట్
(40 years experience)
టీ మీడియా (తెలుగు &English)డిజిటల్
8919710365

శాస్త్రీయ సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ



టి మీడియా, అక్టోబర్ 13, ఖమ్మం రూరల్:
పత్తి సాగులో రైతులు అధిక దిగుబడులు సాధించడంతో పాటు పంట నాణ్యతను పెంపొందించుకునేందుకు శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. ఖమ్మం రూరల్ మండలంలోని తల్లంపాడు రెవెన్యూ పరిధిలో మంగళవారం యం సి పి-- కపాస్ కాంతి పథకంలో భాగంగా వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు క్షేత్ర సందర్శన నిర్వహించి పత్తి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పత్తి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు, పంటలో పాటించాల్సిన శాస్త్రీయ సాగు పద్ధతులు, సమగ్ర పంట యాజమాన్య విధానాలు, చీడపీడల నివారణ చర్యలపై రైతులకు వివరించారు. పంట ఎదుగుదల దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు, చీడపీడలను ముందస్తుగా గుర్తించి తగిన నివారణ పద్ధతులు పాటించడం వంటి అంశాలపై శిక్షణ అందించారు. వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు మెరుగైన దిగుబడులు సాధించే అవకాశముందని వివరించారు. రైతులు పత్తి సాగులో ఎదురయ్యే సమస్యలపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారి జె. ఉమా నాగేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈ ఓ లు), స్థానిక పత్తి రైతులు పాల్గొన్నారు.

పడకేసిన శేరుపల్లి బ్రిడ్జి నిర్మాణ పనులు: బా జ పా శ్రేణులు



టీ మీడియా, అక్టోబర్ 13, పెబ్బేరు:
వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని శేరుపల్లి పరిధిలోని పెబ్బేరు శేరుపల్లి రహదారి మధ్య గల వాగు పైన నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం పనులు గత 4 యేళ్ళుగా అసంపూర్తిగా నిలిచిపోయాయి బ్రిడ్జి లేక పలు వాహనాల రాక పోకలకు చాల ఇబ్బందిగా వుండటంతో పెండింగ్ లో ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులపై బారతీయ జనతాపార్టీ నాయకులు రోడ్లు భవనాల శాఖ అధికారులు బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయిన్ చాలని మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ ఖిమ్యా నాయక్ కు వినతి పత్రాన్ని అందించారు ఈ కార్యక్రమంలో బా జ పా పట్టణ అధ్యక్షుడు కావలి క్రాంతి కుమార్ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ జిల్లా కౌన్సిల్ మెంబర్ సూరగౌని రంగ స్వామి గౌడ్ పెబ్బేరు మున్సిపల్ కన్వీనర్ రామకృష్ణ కార్యకర్తలు పాల్గొన్నారు.

బతుకమ్మ మెట్ల నిర్మాణం



▶▶| పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

టీ మీడియా, అక్టోబర్ 13, నారాయణఖేడ్:
ఖేడ్ మున్సిపల్ పట్టణంలోని 11వ వార్డులో మహిళల సౌకర్యార్థం నిర్మించిన బతుకమ్మ మెట్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అలాగే స్థానిక స్మశానవాటికలో సీసీ రోడ్డు నిర్మాణం కూడా పూర్తికావడంతో ఆయా అభివృద్ధి పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈరోజు పరిశీలించారు.గత సంవత్సరం బతుకమ్మ పండుగ సందర్భంగా 11వ వార్డును సందర్శించిన ఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మహిళలు బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేసే సమయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించారు. మహిళలకు సౌకర్యవంతంగా ఉండేలా బతుకమ్మ మెట్లు నిర్మిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది బతుకమ్మ పండుగకు ఉపయోగపడేలా మెట్ల నిర్మాణ పనులను పూర్తి చేయడం జరిగింది.అదేవిధంగా స్థానిక స్మశానవాటికలో ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా సీసీ రోడ్డు నిర్మాణ పనులను కూడా పూర్తి చేశారు. ఈ అభివృద్ధి పనులు పూర్తికావడంతో స్థానిక ప్రజలకు, ముఖ్యంగా బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు మరింత సౌకర్యం కలగనుంది.ఈ సందర్భంగా బతుకమ్మ మెట్లను, స్మశానవాటికలో నిర్మించిన సీసీ రోడ్డును నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి , జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్, నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ శేట్కర్ సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు.

పాలేరు పాత కాల్వకు నీటి విడుదల



టీ మీడియా ,అక్టోబర్ 13, కూసుమంచి:
పాలేరు రిజర్వాయర్ నుండి ఎట్టకేలకు నీటిపారుదల శాఖ అధికారులు మంగళవారం పాలేరు పాత కాలువకు నీటిని విడుదల చేశారు. కాలువ ఆయకట్టు పరిధిలోని వరి పంటను సాగునీరు అందించి కాపాడాలని కోరుచూ రైతులు రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచారం శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నీటి విడుదలకు సూచించగా, అధికారులు పాలేరు పాత కాలువకు నీటిని విడుదల చేశారు. నీటి విడుదలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.


అంతర్జాతీయ విపత్తుల నివారణ దినోత్సవం



టి మీడియా , అక్టోబర్ 13 ఖమ్మం రూరల్ :
ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల అటానమస్‌లో మేరా యువ భారత్ -- ఖమ్మం, తెలంగాణ, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ విపత్తుల ప్రమాదాల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు మాట్లాడుతూ, విపత్తుల నివారణపై అవగాహనతోనే సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యమని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తుల గోపాల్ విద్యార్థినులు సామాజిక బాధ్యతతో ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు.ముఖ్య అతిథి ఎస్‌డీఆర్ఎఫ్ ప్రతినిధి టి. వెంకటేష్ విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర రక్షణ చర్యలపై ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. మేరా యువ భారత్ -- ఖమ్మం అకౌంట్స్ అధికారి కె. భాను చందర్, అకడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకట రమణ యువత సామాజిక సేవల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఆపదమిత్ర శిక్షణ పొందిన ఎస్. భార్గవి, జి. శిరీష విద్యార్థినులకు విపత్తుల నివారణపై అవగాహన కల్పించగా, వారిని కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన ర్యాలీ ద్వారా ప్రజలకు విపత్తుల నివారణ, భద్రత, ముందస్తు జాగ్రత్తలపై సందేశాలు అందించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శివరామకృష్ణ, యువజన సంఘ సభ్యుడు ఎం.డి. షరూక్ ఇమ్రాన్, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎల్వోసి చెక్కును అందజేసిన మాజీ ఎమ్మెల్యే



టీ మీడియా ,అక్టోబర్ 13, నారాయణఖేడ్ :
కల్హేర్ మండలం కృష్ణాపూర్ గ్రామానికి చెందిన రెహానా తండ్రి వసుధ్ ఆసుపత్రి వైద్య ఖర్చుల కొరకు మంజూరైన 2 లక్షల రూపాయల ఎల్వోసి చెక్కును లబ్ధిదారులకు అందజేసిన ఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి వారితో పాటు వారి కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్,ఎంఎస్పీ నూతన కమిటీల ఎన్నిక

⏭ అధ్యక్షుడిగా కాంపాటి రవి,

⏭ ఎంఎస్పీ అధ్యక్షుడిగా రాయల నరేందర్

టీ మీడియా,అక్టోబర్13,సింగరేణి(కారేపల్లి):

ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో ఎమ్మార్పీఎస్,ఎంఎస్పీ నూతన కమిటీలను ఎన్నుకున్నారు.ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా కాంపాటి రవి,ఎంఎస్పీ అధ్యక్షుడిగా రాయల నరేందర్ ఎన్నికయ్యారు.ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శులుగా రాయల శ్రీనివాస్,ఆదేర్ల నాగరాజు,ఉపాధ్యక్షులుగా లింగపోగు బసవరాజు,కనకం పవన్ కుమార్ ఎన్నికయ్యారు.ఎంఎస్పీ అధికార ప్రతినిధిగా దండు ప్రసాద్,ఉపాధ్యక్షుడిగా సరికొండ రాములు,కార్యదర్శిగా చిగురుతి అంజయ్య బాధ్యతలు చేపట్టారు.సంఘాల బలోపేతం,సామాజిక న్యాయం,అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం ఐక్యంగా పనిచేయాలని నాయకులు సూచించారు.మాజీ మండల అధ్యక్షులు నాగేంద్రబాబు,ఆదేర్ల



రామారావుకు జిల్లా కమిటీలో అవకాశం కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా,మండల నాయకులు తూరుగంటి అంజయ్య,కనకప్పుడి జనార్ధన్,ఆదేర్ల అంజయ్య, తిప్పారపు నాగేందర్,కేశగాని బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుండా మల్లేష్ కు సీపీఐ ఘన నివాళి



టీ మీడియా, అక్టోబర్ 13, రామకృష్ణాపూర్:

బూటకపు ఎన్ కౌంటర్లకు వ్యతిరేకంగా, పేదల సంక్షేమం కోసం పోరాడిన యోధుడు కామ్రేడ్ గుండా మల్లేష్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు.క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ సీపీఐ కార్యాలయంలో మంగళవారం గుండా మల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన నిస్వార్థ పోరాట స్ఫూర్తి కమ్యూనిస్టు ఉద్యమానికి ఆదర్శమని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్ అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వనం సత్యనారాయణ, మామిడి గోపి, కౌన్సిలర్లు కొడగాని సాంబయ్య, మద్దెల శంకర్, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ పథకం కింద పత్తి రైతులకు శిక్షణ



టీ మీడియా, అక్టోబర్ 13, కూసుమంచి:

కూసుమంచి మండలంలోని మునిగేపల్లి, కిష్టాపురం గ్రామాలలో రైతులకు పత్తి పంటలో చీడపీడలు, తెగుళ్ల నివారణపై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం వ్యవసాయ క్షేత్రంలోనిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం వైరా శాస్త్రవేత్తలు డాక్టర్ పావని డాక్టర్ ఫణిశ్రీ పాల్గొని రైతులకు పత్తి పంటలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు .ఈ సందర్భంగా వారు పత్తి పంటలో ప్రధానంగా వచ్చే చీడపీడలు మరియు తెగుళ్లను గుర్తించడం, వాటి నివారణ, సమగ్ర సస్యరక్షణ చర్యలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పత్తి పంటలో చీడపీడలు, తెగుళ్లను ప్రారంభ దశలోనే గుర్తించి, శాస్త్రీయ పద్ధతుల్లో నియంత్రణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు.అవసరానికి అనుగుణంగా సిఫారసు చేసిన మందులను మాత్రమే వినియోగించాలని, పంటలో పురుగు మందుల వాడకంలో తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రస్తుతం గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించాలని తెలిపారు. అనంతరం పత్తి పంటను సందర్శించి, రైతులకు ప్రతి పంటలో వినియోగించే మొక్క పెరుగుదల నియంత్రకాలు సబ్సిడీలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తపావని , ఫణి శ్రీ, కిష్టాపురం గ్రామ సర్పంచ్ సైదులు , మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి , ఏఈఓ రవీందర్ ,జానీ బాబా , రైతులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

⏭ మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలింపు

టీ మీడియా,అక్టోబర్13,సింగరేణి(కారేపల్లి):

కారేపల్లిలోని స్థానిక సినిమా హాల్ సెంటర్‌లో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది.ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు.స్థానికుల సమాచారం ప్రకారం చింతలపాడు గ్రామానికి చెందిన పవన్ ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తూ సినిమా హాల్ సెంటర్ వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో పవన్ తలకు గాయాలు కాగా,ఎదురుగా ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తికి కాలుకు గాయాలయ్యాయి.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రులను వెంటనే కారేపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



ముస్తాబవుతున్న శ్రీశ్రీశ్రీ కోట మైసమ్మ దేవాలయం





⏭ 20 నుంచి 26 వరకు వైభవంగా జాతర

టీ మీడియా,అక్టోబర్13,సింగరేణి(కారేపల్లి):

ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీశ్రీశ్రీ కోట మైసమ్మ అమ్మవారి దేవస్థానం జాతరకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది.ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ ట్రస్ట్,దేవాదాయ శాఖ,పోలీసు శాఖ సమన్వయంతో ఏర్పాట్లు ముమ్మరం చేశారు.జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ముందస్తు ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.కారేపల్లి సీఐ నూనావత్ సాగర్,ఎస్సై బైరు గోపి ఆలయ పరిసరాలను పరిశీలించి భద్రత,ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా వాహనాల పార్కింగ్ కోసం అనువైన ప్రదేశాలను పరిశీలించారు.ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగానే ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ డా ' పర్సా పట్టాభి రామారావు తెలిపారు.భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని అవసరమైన ఏర్పాట్లను ముందుగానే చేపడుతున్నామన్నారు.అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు ఆలయ ట్రస్ట్,సిబ్బంది కృషి చేస్తున్నట్లు చెప్పారు.

భద్రతపై పోలీసుల ప్రత్యేక దృష్టి

జాతర జరిగే రోజుల్లో భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడంతో పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడటం,పార్కింగ్‌ను క్రమబద్ధీకరించడం,ఆలయ పరిసరాల్లో భద్రత కల్పించడంపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది.ఆలయ ట్రస్ట్,దేవాదాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ జాతర ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ డా ' పర్సా పట్టాభి రామారావు,ఆలయ ఈవో కే.వెంకటయ్య, జూనియర్ అసిస్టెంట్ పగడాల మోహన్ కృష్ణ,లలిత్ సాయి, అర్చకులు కొత్తలంక.కైలాష్ శర్మ, భైరవభట్ల సాయిరాం శర్మ,పోలీసు సిబ్బంది,ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ భర్తకు పరామర్శ

⏭ సంఘం ఆధ్వర్యంలో సుజాత దంపతులకు భరోసా

⏭ వీడియో కాల్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే

టీ మీడియా,అక్టోబర్13,సింగరేణి(కారేపల్లి):

ఖమ్మం జిల్లా సింగరేణి మండలం పాటిమీదిగుంపు సర్పంచ్ గుగులోత్ సుజాత భర్త సంతోష్‌ను సింగరేణి మండల సర్పంచుల సంఘం నాయకులు మంగళవారం పరామర్శించారు.ఇటీవల పండితాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సంతోష్ గాయపడగా,విషయం తెలుసుకున్న సర్పంచులు పాటిమీదిగుంపు వెళ్లి సుజాత దంపతులను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు,గాదెపాడు సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో సర్పంచులు సంతోష్‌ను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ప్రమాదం నుంచి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని



ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సర్పంచ్ గుగులోత్ సుజాత,సంతోష్‌తో వీడియో కాల్ ద్వారా మాట్లాడారు.ప్రమాదం జరిగిన తీరు, సంతోష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఆయన త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.పరామర్శించిన వారిలో సూర్యతండా సర్పంచ్,సింగరేణి మండల సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షుడు బానోత్ రాందాస్ నాయక్,సంఘం ఉపాధ్యక్షుడు ఈసం మోతి వీరస్వామి,పేరుపల్లి సర్పంచ్ బానోత్ పద్మ వీరభద్రు,గేట్ కారేపల్లి సర్పంచ్ పూసం ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

సోలార్ ప్లాంట్‌లో కేబుల్స్ చోరీ!

⏭ రూ.10 లక్షల విలువైన కేబుల్స్ అపహరణ

టీ మీడియా, అక్టోబర్ 13, ఎర్రుపాలెం:

మండల పరిధిలోని రాజుపాలెం గ్రామంలోని మణితేజ--లక్ష్మి 2.4 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌లో మరోసారి కేబుల్స్ చోరీ ఘటన కలకలం రేపింది. సుమారు రూ.10 లక్షల విలువైన కేబుల్స్ అపహరణకు గురైనట్లు ప్రాజెక్టు నిర్వాహకులు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.ప్లాంట్‌లోని 200 మీటర్ల ఆర్ ఎస్ 485 కేబుల్‌తో పాటు 2,000 మీటర్ల కేబుల్స్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. గతంలోనూ ఇదే ప్లాంట్‌లో సుమారు ఆరు నెలల క్రితం రూ.5 లక్షల విలువైన డిసి కేబుల్స్ చోరీకి గురయ్యాయని తెలిపారు. అప్పట్లో సంబంధిత అధికారులకు సమాచారం అందించినప్పటికీ,ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోకపోవడంతోనే మరోసారి చోరీ జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

చోరీలతో నష్టపోతున్నాం.

స్వచ్ఛమైన, పర్యావరణహితమైన విద్యుత్‌ను



ఉత్పత్తి చేసి సమాజానికి అందించాలనే లక్ష్యంతో సోలార్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నామని బాధితులు తెలిపారు. అయితే, వరుస చోరీల కారణంగా భారీ ఆర్థిక నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేబుల్స్ అపహరణతో విద్యుత్ ఉత్పత్తికి కూడా అంతరాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు.ఈ ఘటనను పోలీసులు తీవ్రంగా పరిగణించి, సమగ్ర విచారణ జరిపి చోరీకి పాల్పడిన వారిని గుర్తించాలని బాధితులు కోరారు. చోరీకి గురైన కేబుల్స్‌ను రికవరీ చేసి, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్లాంట్‌కు తగిన భద్రత కల్పించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

రామచంద్రాపురంలో డీపీఓ తనిఖీలు

టీ మీడియా, అక్టోబర్ 13, అశ్వాపురం:

మండలంలోని రామచంద్రాపురం గ్రామపంచాయతీని మంగళవారం డీపీఓ అనూషసందర్శించి అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న వీవో భవన పనుల పురోగతిని తెలుసుకోవడంతో పాటు కొత్త పింఛన్ల దరఖాస్తులను పరిశీలించారు.అర్హులకు ప్రభుత్వ నిబంధనల మేరకు పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పంచాయతీ రికార్డులను తనిఖీ చేసి, అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ముత్యాలరావు, సర్పంచ్ బురెడ్డి స్వాతి, పంచాయతీ కార్యదర్శి తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.



పుష్కరాల ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి



● జిల్లా కలెక్టర్ అంకిత్

టీ మీడియా, అక్టోబర్ 13, భద్రాచలం:

గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులు, పుష్కర ఘాట్ల నిర్మాణం, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లతో కలిసి వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు.ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి చేరుకున్న కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠకు ఆలయ అధికారులు స్వామివారిని దర్శించుకోగా, అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. దర్శనానంతరం ఆలయ ఉత్తర ద్వారం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్, ఆలయ ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో చేపట్టిన నిర్మాణాల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్లాబ్ నిర్మాణం, రక్షణ గోడలు, మట్టి నింపే పనులు తదితర నిర్మాణాలను పరిశీలించి, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం ఆలయం నుంచి గోదావరి స్నాన ఘాట్లకు వెళ్లే రహదారిని పరిశీలించిన కలెక్టర్, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రహదారిని విస్తరించాలని ఆదేశించారు. ప్రస్తుతం సుమారు 25 అడుగుల వెడల్పు ఉన్న రహదారిని మరో ఐదు అడుగులు విస్తరించి 30 అడుగులకు పెంచే ప్రతిపాదనపై చర్చించారు.రహదారికి ఇరువైపులా ఉన్న నిర్మాణాలు, మెట్లు, ఇతర అడ్డంకులను పరిశీలించి అవసరమైన చోట్ల మార్కింగ్ చేయాలని సూచించారు. వైకుంఠధామానికి వెళ్లే మార్గాన్ని పరిశీలించిన కలెక్టర్, పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఉన్న రహదారికి ప్రత్యామ్నాయంగా మరో మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు చేపట్టడంతో పాటు వైకుంఠధామం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు.పుష్కర ఘాట్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, ఉత్తర వైపు సుమారు 270 మీటర్లు, దక్షిణ వైపు 230 మీటర్ల పొడవున చేపడుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ఘాట్ల వద్ద మెట్లు, ల్యాండింగ్ ప్రాంతాలు, రక్షణ గోడలను పటిష్టంగా నిర్మించాలని, పాత గోడలకు పగుళ్లు ఏర్పడిన చోట మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పర్ణశాల వద్ద టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. సారపాక బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్, ఐటీసీ నుంచి భద్రాచలం బ్రిడ్జి వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారి సుందరీకరణకు చేపట్టాల్సిన చర్యలపై ఐటీసీ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో చర్చించారు.గోదావరి పుష్కరాలకు సమయం తక్కువగా ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మార్చిలో జరిగే శ్రీరామనవమి ఉత్సవాలతో పాటు జూన్ 27 నుంచి జూలై 7 వరకు నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఆర్ అండ్ బి ఈ ఈ నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, తహసిల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో బి.ఆర్.ఎస్ నాయకులు



టీ మీడియా, అక్టోబర్ 13, దమ్మపేట:

మండల పరిధిలోని మల్లారం కాలనీ ఆడపడుచుల ఆహ్వానం మేరకు మూడవ రోజు ముద్దపప్పు బతుకమ్మ వేడుకల్లో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులుసోయం వీరభద్రం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోయం వీరభద్రం మాట్లాడుతూ 2014 సంవత్సరం లో కెసిఆర్ ముఖ్యమంత్రి గా ఉన్న సమయం లో బతుకమ్మ పండుగను తెలంగాణ రాష్ట్ర పండుగ గా గుర్తిశీచి, బతుకమ్మ పండుగ కి రాష్ట్ర ప్రభుత్వం తరపున బతుకమ్మ చీరలు, నిర్వాహణ నిమిత్తం నిధులు కేటాయించిదని గుర్తు చేసారు. అనంతరం సోయం వీరభద్రంను మహిళలు శాలువాతో ఘనంగా సత్కరిశీచారు.మ్యాప్‌లు చూడండిఈ కార్యక్రమం లో శీలం శ్రీను, దేవా (దేవధానం), అశ్వరావుపేట నియోజకవర్గ యువ రాజకీయ నాయకులు వాడే వీరస్వామి, మహిళలు తధితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను బర్తరఫ్ చేయాలి



● సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు

టీ మీడియా, అక్టోబర్ 13, ఇల్లెందు:

ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల మంది ఓటర్లను తొలగించారంటూ సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సుల్తానా అధ్యక్షతన జరిగిన సీపీఎం ఇల్లెందు మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు.ఢిల్లీలో నిరసన తెలుపుతున్న ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల నాయకులపై లాఠీచార్జి చేయడం సరికాదన్నారు. శాంతియుత నిరసనలను అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే భవిష్యత్తులో ప్రజా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఏజే రమేష్, అబ్దుల్ నబీ, ఆలేటి కిరణ్ కుమార్, తాలూరి కృష్ణ, మన్యం మోహన్ రావు, ఎస్కే ఖాదర్, మాదారపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

టీ మీడియా,అక్టోబర్13, చుంచుపల్లి, :

మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలుస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ సీఈవో బి.నాగలక్ష్మి ముగ్గురికి కారుణ్య నియామకాలు కల్పించారు. అంబేద్కర్ నగర్‌లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగి కుమారుడు జీ.తరుణ్‌కు గుండాల మండల పరిషత్ కార్యాలయంలో, పెనగడప పాఠశాలలో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తూ మరణించిన విజయ్ కుమార్ కుమారుడు పూర్ణచంద్రరావుకు ములకలపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా నియామకాలు కల్పించారు. అలాగే, అన్నపురెడ్డిపల్లి మండలం ఊటుపల్లి పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తూ మరణించిన రాము భార్య టి.వెంకటలక్ష్మికి మద్దుకూరు జడ్పీహెచ్ఎస్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా నియామకం కల్పించారు. ఈ సందర్భంగా



తెలంగాణ పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పులికంటి వెంకటేశ్వర్లు సీఈవో బి. నాగలక్ష్మికి సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ఈ చర్య అభినందనీయమని పేర్కొన్నారు.

కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి



● దర్శించుకున్న కమిషనర్

టీ మీడియా, అక్టోబర్ 13, మల్కాల:

శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం, కొండగట్టును దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్రీ మంత్రి హనుమంతరావుకుటుంబ సభ్యులతో కలిసి సందర్శించి, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి అంజనా రెడ్డి కమిషనర్ కు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చారణలతో కమిషనర్ ఆశీర్వచనం అందజేశారు.కమిషనర్ మాట్లాడుతూ, కొండగట్టు దేవస్థాన అభివృద్ధికి అవసరమైన పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారి రూ. 35.19 కోట్ల నిధులతో 96 గదుల ధర్మసత్రం మరియు దీక్ష విరమణ మండపం నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయిందని, పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయని వివరించారు.

పోలీసులపై దాడి చేసిన 20 మంది అరెస్టు



● మరో 30మందిపై విచారణ

టీ మీడియా,అక్టోబర్13, ఆదిలాబాద్ :

జిల్లాలో పోలీసుల విధి నిర్వహణకు ఆటంకం కలిగించడమే కాకుండా, వారిపై దాడికి పాల్పడిన సుమారు 20 మంది గ్రామస్థులపై పోలీసుల హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మరో ముప్పై మందిపై కేసు నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్? మహాజన్? వెల్లడించారు. ఆదిలాబాద్?లోని పోలీసు హెడ్? క్వార్టర్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.ఈ నెల 10వ తేదీన సిరికొండ మండలం ఆదివాసీ గూడెం వాయిపేటలో గంజాయి కేసు విషయంపై విచారణకు వెళ్లిన ఇచ్చోడ గ్రామీణ సీఐ సీహెచ్? రమేశ్తో పాటు ఏఎస్?ఐ బలిరాం నాయక్?, హెడ్?కానిస్టేబుల్? భీంరావు, మరో కానిస్టేబుల్? శివప్రసాద్? సహా మరో ముగ్గురిపై దాడి చేసిన 20 మందిని అరెస్టు చేసి రిమాండ్?కు పంపించినట్లు తెలిపారు. మరో ముప్పై మందిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. వాయిపేటలో ఓ మహారాజ్ సాగుచేసే గంజాయి కేసు దర్యాప్తు కోసం వెళ్లిన పోలీసులపై దాడి చేయటమే కాకుండా వాహానాన్ని ధ్వంసం చేశారని ఎస్పీ తెలిపారు. వారందరిపై సెక్షన్? 307, 332 కేసులు నమోదు చేయటమే కాకుండా అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. అలాగే దాడిలో పోలీసు వాహనం సహా వారి ఫోన్లు ధ్వంసమయ్యాయని పేర్కొన్నారు.

అసలేం జరిగిందంటే?

వాయిపేట్?కు చెందిన చహకత రాము తన పెరట్లో సాగు చేస్తున్న 18 గంజాయి మొక్కలను పోలీసులు ఈ నెల 9వ తేదీన స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు విషయమై తదుపరి విచారణ కోసం సీఐ, ఎస్?ఐ, మరో నలుగురు కానిస్టేబుళ్లను 12వ తేదీన గ్రామానికి వెళ్లగా స్థానికులు చుట్టుముట్టారు. గంజాయి సమాచారం ఎవరు ఇచ్చారో చెప్పాలని నిలదీస్తూ అక్కడే ఉన్న అటవీ బేస్? క్యాంపు సిబ్బందిపై చేయిచేసుకున్నారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అనంతరం గ్రామస్థులు మహిళలతో కలిసి రాళ్లు, కర్రలతో దాడి చేయడంతో పోలీసులు గాయపడ్డారు. పోలీసు వాహనం సహా వారి ఫోన్లు ధ్వంసమయ్యాయి. విచారణ సందర్భంగా పోలీసులు గ్రామస్థులను కులం పేరుతో దూషించారని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలోనే వివాదం తలెత్తిందన్నారు.

ఫంగిసైడ్ నూతన ఉత్పత్తి ఆవిష్కరణ



● మిర్చి పంటలో ఫీల్డ్ డెమోలి

టీ మీడియా, అక్టోబర్ 13 , కొణిజర్ల:

ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం లాలాపురం గ్రామంలో ఎండోఫీల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీకి చెందిన సోఫోన్ ఫంగిసైడ్ నూతన ఉత్పత్తిని మండల వ్యవసాయ అధికారి దొడ్డిగల్ల బాలాజీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన రైతు షేక్ సర్దార్‌మియా మిర్చి పంటలో అలెక్టో డ క్యూబికో ఉత్పత్తులకు సంబంధించిన ఫీల్డ్ డెమోను కూడా ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ, సోఫోన్ తమ కంపెనీకి చెందిన నూతన ఉత్పత్తి అని, దీనిని వివిధ పంటల్లో వినియోగించే అవకాశాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఉత్పత్తి వినియోగం, లక్ష్య వ్యాధులు, పంటలకు అనుకూలత వంటి అంశాలను లేబుల్‌పై ఉన్న సూచనల ప్రకారం పాటించాలని పేర్కొన్నారు.మండల వ్యవసాయ అధికారి దొడ్డిగల్ల బాలాజీ మాట్లాడుతూ, ప్రముఖ కంపెనీలు గ్రామస్థాయిలోనే ఫీల్డ్ డెమోలు ఏర్పాటు చేసి రైతులకు పంటల్లో ఉత్పత్తుల పనితీరును ప్రత్యక్షంగా వివరించడం ఉపయోగకరమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా రైతులకు నూతన వ్యవసాయ సాంకేతికతలు, పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెటింగ్ మేనేజర్ శ్రీకాంత్, మార్కెటింగ్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, ఏరియా మేనేజర్ రాఘవ, డెవలప్‌మెంట్ ఆఫీసర్ కార్తిక్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, శివతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.